క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



కమిషనర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: క్రమశిక్షణ, అంకిత భావంతో విధులు నిర్వహిస్తున్న కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్‌కు మరెన్నో పదోన్నతులు రావాలని చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి ఆకాంక్షించారు. కొత్తగూడెం మున్సిపాలిటీ కమిషనర్ రఘుకు గ్రేడ్-1 కమిషనర్ నుంచి స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా పదోన్నతి వచ్చిన సందర్భంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సన్మానించారు. మాట్లాడుతూ... కష్టానికి ఫలితంగా ఉద్యోగ కాలంలో ఇలాంటి పదోన్నతులు రావడం ఆనందం కలిగిస్తాయన్నారు.

దరఖాస్తులు స్వీకరణ

పాల్వంచ: పాల్వంచలోని మైనార్టీ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు కొరకు దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ షేక్.బిపాషా తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, పదో తరగతి మెమో, కుల, ఆదాయ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఐదు పాస్‌ఫొటోలు, అన్ని ఒరిజినల్స్‌తో కేఎస్పీ రోడ్డులోని తమ కళాశాలను సందర్శించాలని కోరారు.

ప్రవేశాలు ప్రారంభం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నుంచి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ కోర్సులు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సులలో విద్యార్థులు అడ్మిషన్లు పొందవచ్చని ధృవపత్రాలతో, కళాశాల పని దినములతో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నిరసన



ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు

చుంచుపల్లి: సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం కొత్తగూడెం డిపో గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రీజియన్ గౌరవ అధ్యక్షుడు భాస్కర్‌రావు మాట్లాడుతూ.. గతంలో మిగిలిపోయిన రెండు సంవత్సరాల వేతన సవరణ చేయాలన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు తక్షణమే గుర్తింపు ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం కార్మికుల పట్ల వేధింపులు ఆపాలని కోరారు. రమేష్‌బాబు, ఎస్ఆర్ బాబు, భద్రయ్య, కేఎస్ రావు, రేణుకాదేవి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని ధర్నా



బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

ఇల్లెందురూరల్: మంచినీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ మండలంలోని కొమ్ముగూడెం గ్రామపంచాయతీ కొత్తగుంపు మహిళలు ఖాళీ బిందెలతో గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సర్పంచ్ సూర్నపాక రామయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. తాగునీటి సమస్యపై మిషన్ భగీరథ అధికారులకు వివరించి నీటి సరఫరా మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తోడేటి నాగేశ్వరరావు, ఇర్ప భద్రమ్మ, ఏపె మల్లేశ్వరి, జోగ రాంబాబు, వాసం నాగమణి, చుంచు కుమారి, వాసం భద్రమ పాల్గొన్నారు.

‘బోరు’ మంటున్నాయి!

- అడుగంటిన భూగర్భజలాలు
- మరమ్మతులకు నోచుకోని బోర్లు
- తాగునీటికి స్థానికుల ఇక్కట్లు





దంతలబోరు ఎస్సీకాలనీ, కుంజ వెంకయ్య గుంపు గ్రామాల్లో నీళ్లు రాని బోర్లు

పాల్వంచరూరల్: పాలకులు, అధికారుల పట్టింపు లేక నీటి పథకాలు నిరుపయోగంగా మారుతున్నాయి. వేసవికాలం సగం ముగిసినా బోర్లను పట్టించుకునే దిక్కు లేదు. మండలంలో చేతిపంపులు చిన్నచిన్న మరమ్మతుల కారణంగా మూలనపడ్డాయి. దీంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండలంలోని 36 గ్రామపంచాయతీల్లో మొత్తం 468 బోర్లు ఉన్నాయి. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో నీళ్లు అందక చాలా వరకు నిరుపయోగంగా మారాయి.

ఇబ్బందులు పడుతున్న స్థానికులు...

నర్సంపేటలో మిషన్ భగీరథ నీళ్ల ఓవర్ హెడ్ ట్యాంక్‌కు ఎక్కించకపోవడంతో గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బసవతారక కాలనీ పంచాయతీలోని సీతానగర్ కాలనీలో డైరెక్ట్ పంపింగ్ వలన నీళ్లు సక్రమంగా సరఫరా జరగక నిత్యం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో వాటర్ ట్యాంక్‌ను నిర్మించాలని పలుమార్లు పాలకులను, సంబంధిత అధికారులను కోరినా పట్టించుకోవడం లేదు. దంతలబోరు పంచాయతీ గొల్లగూడెం గ్రామానికి మిషన్ భగీరథ పైపులైన్ నిర్మాణం చేయలేదు. పాత పైపులైన్ ద్వారా కూడా నీటి సరఫరా జరగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దంతలబోరు ఎస్సీకాలనీ, బంజర పంచాయతీలోని కుంజవెంకయ్య గుంపు, తవిశలగూడెం, సారెకల్లు, కారెగట్టు, పాండురంగాపురం తండాలో భూగర్భజలాలు అడుగంటిన కారణంగా బోర్లలో నీళ్లు రావడం లేదు.

మిషన్ భగీరథ నీళ్లు సక్రమంగా రావడం లేదని, బోర్లలో నీళ్లను వినియోగించుకుందామన్నా అవి పనిచేయడం లేదని ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు.

బోర్ల రిపేరు చేయాలి



పనిచేయని చేతిపంపులను ఎవరూ పట్టించుకోవడం లేదు. దూరంగా వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించి పనిచేయని బోర్లకు రిపేరు చేయించి ప్రజల దాహార్తిని తీర్చాలి.

– శనిగ చిన్నముత్తులు, దంతలబోరు ఎస్సీకాలనీ

ఎండాకాలంలో అవస్థలు



వేసవికాలంలో బోరును కొట్టీ కొట్టీ చేతులకు బొబ్బలు వస్తున్నాయి తప్ప, బిందె నిండడం లేదు. నీళ్లు అందని బోర్లను మరింత లోతుగా డ్రిల్లింగ్ చేయాలని చెప్పిన ఎవరూ పట్టించుకోవడం లేదు.

– పూనెం కాంతమ్మ, కుంజావెంకయ్య గుంపు

మరమ్మతులు చేయిస్తాం



భూగర్భజలాలు అడుగంటి బోర్లలో నీళ్లు రావడం లేదు. కొన్ని బోర్లు మరమ్మతులకు గురయ్యాయి. వేసవికాలం దృష్ట్యా ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటాం.

– నీలావతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

ప్రజలకు అండగా ఉంటాం..



కరపత్రాలతో ప్రచారం చేస్తున్న నాయకులు

సుజాతనగర్: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ అవినీతిపై పోరాటం చేసేది ఒక్క బీఎస్పీ పార్టీ మాత్రమేనని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. మంగళవారం గరీబ్‌పేట గ్రామంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి బీఎస్పీ పార్టీ విధానాలను ప్రజలకు వివరించారు. మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న యువతీ, యువకులు బీఎస్పీ పార్టీ విధానాల పట్ల ఆకర్షితులవుతున్నారని తెలిపారు. మూసధోరణిలో ఎన్నికల్లో ఓటు వేసే పద్ధతికి స్వస్తి చెప్పాలన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ప్రజలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో తుంపూరి రాజు, మందా ప్రేమ్‌కుమార్, రోహిత్, జెట్టి తేజా, బెరెల్లి రాకేష్, మేకపోతుల వివేక్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌రావు బహిష్కరణ

జూలూరుపాడు: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జూలూరుపాడు, సుజాతనగర్ మండలాల కార్యదర్శిగా పని చేస్తున్న ఏదులాపురం గోపాల్‌రావును పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, జిల్లా నాయకుడు ఎస్కే ఉమర్ తెలిపారు. మంగళవారం ఆ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం జూలూరుపాడులో నిర్వహించారు. మాట్లాడుతూ.. కొంత కాలంగా గోపాల్‌రావు పార్టీలో నిర్మాణ విచ్ఛిన్న చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వల్లోజి రమేష్, కందగట్ల సురేందర్, బత్తుల గోపి, కల్తి నరసింహారావు, నరసింహారావు పాల్గొన్నారు.

పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలి



చుంచుపల్లి: జెండా ర్యాలీ ఊపి ప్రారంభిస్తున్న అధికారులు



ఇల్లెందు: ప్రభుత్వాస్పత్రి ఉద్యోగుల డెంగీ నివారణ అవగాహన ర్యాలీ

చుంచుపల్లి: జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుకృత జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. డెంగీ వ్యాధికి చికిత్స లేదని నివారణే మార్గమని తెలిపారు. డెంగీ దోమలు వ్యాప్తి చెందకుండా ప్రజలందరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

పాల్వంచ: ఉల్వనూరులో పీహెచ్‌సీ డాక్టర్ తేజస్వీ ఆధ్వర్యంలో మంగళవారం డెంగీ నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీ గిరిజన ప్రాంతమైన రాళ్లచెలకలో గిరిజనులకు మలేరియా సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు.

సుజాతనగర్: జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సుజాతనగర్‌లో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ రమేష్ మాట్లాడుతూ.. వర్షాకాలం రాకముందే డెంగీ నివారణకు జాగ్రత్తలు తీసుకొంటే వ్యాధిని నివారించవచ్చన్నారు. దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

ఇల్లెందు: ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమ తెరలు వాడాలని రొంపేడు పీహెచ్‌సీ డాక్టర్ కవిత కోరారు. మంగళవారం డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ర్యాలీ నిర్వహించారు. పట్టణ ప్రధాన సెంటర్ మానవహారం నిర్మించారు. డాక్టర్ కవిత మాట్లాడుతూ.. ప్రజలంతా ఆరోగ్య రక్షణ కోసం తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

వాగులో చెత్త తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

టేకులపల్లి: టేకులపల్లి, గోలియా తండా గ్రామ పంచాయతీలకు హద్దుగా ఉన్న ఇనుపమోరి వాగు చెత్త కుండీగా మారింది. దుర్గంధంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ మేరకు ఈనెల 15న సాక్షి దినపత్రికలో ‘వాగునే డంపింగ్ యార్డు చేశారు’అనే వార్తా కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. మంగళవారం ఎంపీడీఓ కోట వీరబాబు, ఎంపీఓ గాంధీ, ఏపీఓ శ్రీనివాస్, కార్యదర్శులు కిరణ్, ప్రశాంత్‌లు వాగుని పరిశీలించారు. వర్కర్లను పిలిపించి వాగులో చెత్తా చెదారం తొలగించి శుభ్రం చేయించారు.

కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేత

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా నుంచి కారుణ్య నియామకాల్లో భాగంగా మెడికల్ అన్‌ఫిట్ అయిన ఇద్దరు సింగరేణి ఉద్యోగుల వారసులకు ఉద్యోగావకాశాలు కల్పించారు. ఈ మేరకు జీఎం ఎం.షాలేమురాజు మంగళవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. పంజాల శ్రీనివాసు, మల్లారపు మల్లయ్య, జీవీ మోహన్‌రావు, సాయి స్వరూప్, ఎస్.రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బోడులో మెగా వైద్య శిబిరం

టేకులపల్లి: కలెక్టర్, ఐటీడీఏ పీఓల ఆదేశానుసారం ఐటీడీఏ సహకారంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం బోడు ఉన్నత పాఠశాల ఆవరణలో మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని మండల పరిషత్ అధ్యక్షురాలు భూక్యా రాధ, స్థానిక సర్పంచ్ ఇరప లక్ష్మీనారాయణ ప్రారంభించారు. శిబిరంలో 45 మంది గర్భిణులకు, 24 మంది చిన్నపిల్లలకు, పెద్దలు 167 మొత్తం 238 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో వైద్యులు ఎస్.మాధురి, ఇ.వెంకన్న, ఎం.నరేష్, బి.కోటేశ్వరరావు, ఎస్.సోమరాజు దొర, ఆర్.భాగ్యలక్ష్మి, బి.మురళీధర్, కందుల దినేష్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సీతమ్మ, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ పాయం శ్రీను, హెచ్ ఈఓ దుర్గారావు, ఎంపీపీ, స్థానిక ఎస్ఐ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులు

రైలును పునరుద్ధరించాలి

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ (బీడీసీఆర్) నుంచి డోర్నకల్ వెళ్ల ప్యాసింజర్‌ను నడపాలని, గత సంవత్సరం మంజూరైన డబుల్ లైన్ పనులు వెంటనే చేపట్టాలని కోరుతూ కొవ్వూరు రైల్వే లైన్ సాధన కమిటీ కన్వీనర్ కొదమసింహ పాండురంగ చార్యులు ఆధ్వర్యంలో మంగళవారం రైల్వే స్టేషన్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. మేదరమెట్ల పురుషోత్తం, కొండి గణేష్, కృష్ణ, సతీష్ యాదవ్, పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుడి మృతి

పాల్వంచ: పట్టణంలోని బొల్లేరుగూడేనికి చెందిన మున్సిపాలిటీ పారిశుద్ధ్య విభాగం ఔట్ సోర్సింగ్ కార్మికుడు నీలకంఠ రాంబాబు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. పలువురు సందర్శించి సంతాపం తెలిపారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాసరావు, మున్సిపల్ మేనేజర్ సత్యనారాయణ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ నివాళులర్పించారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

సుజాతనగర్: సింగభూపాలెం గ్రామానికి చెందిన చిలకా నాగయ్యకు చెందిన గేదె విద్యుదాఘాతంతో మంగళవారం మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు... ప్రతిరోజూ మాదిరిగానే గేదె మేతకు వెళ్లింది. ఈ క్రమంలో పొలంలో సర్వీస్ వైరు తెగి కిందకు వేలాడుతోంది. ఈ క్రమంలో వైరు గేదెకు తాకడంతో షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతు నాగయ్య విద్యుత్ అధికారులను వేడుకుంటున్నాడు.

కొనసాగుతున్న సీఎం కప్ క్రీడా పోటీలు



ఇల్లెందురూరల్: వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో సీఎం కప్-2023 మండల స్థాయి క్రీడా పోటీలు కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో కొనసాగుతున్నాయి. మంగళవారం వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఎండ తీవ్రత కారణంగా యువతీ, యువకులు క్రీడా పోటీలకు ఆసక్తి చూపకపోవడంతో పలుచోట్ల క్రీడా మైదానాలు వెలవెలబోయాయి. అరకొర సౌకర్యాల నడుమ క్రీడా పోటీలు మొక్కుబడిగా సాగుతున్నాయి. – సాక్షి నెట్‌వర్క్



పాల్వంచ: వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు



చుంచుపల్లి: పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ శాంతి



జూలూరుపాడు: విజేత జట్టుతో అధికారులు



సుజాతనగర్: వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

రాష్ట్రావతరణ వేడుకలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జీఎం కట్టా బసవయ్య

సింగరేణి(కొత్తగూడెం): జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సింగరేణి కార్పొరేట్ ఏరియా పరిధిలోని ప్రకాశం స్టేడియంలో ఘనంగా నిర్వహించాలని, జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య తెలిపారు. మంగళవారం ఆయన వివిధ విభాగాల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ముఖ్యఅతిథులచే జాతీయ పతాకావిష్కరణ, తెలంగాణ మార్చ్, అమరవీరుల స్తూపాలకు నివాళి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ వేడుకల ఏర్పాట్లకు సెక్యూరిటీ, సివిల్, మెడికల్, ట్రాన్స్‌పోర్ట్, విద్యుత్, పర్సనల్ విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా వివిధ పాఠశాలల ఆధ్వర్యంలో కవాతు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జీఎం సివిల్ టి.సూర్యనారాయణ, జీఎం ఫైనాన్స్ సుబ్బారావు, జీఎం ఎడ్యుకేషన్ వెంకటేశ్వరరావు, డీజీఎం పర్సనల్ కోడూరి శ్రీనివాస్‌రావు, రాజీవ్‌కుమార్, సెక్యూరిటీ, పర్సనల్ సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి పథకం.. పేదలకు వరం

టేకులపల్లి: సీఎం కేసీఆర్ అందిస్తున్న కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడపడుచులకు అండగా ఉంటోందని ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ అన్నారు. ఈ మేరకు మంగళవారం టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయంలో 56 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సీఎం కేసీఆర్ పేదింటి ఆడపడుచుల కోసం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. మొదటగా రూ.51వేలు, ఆ తర్వాత రూ.75,116, ప్రస్తుతం రూ.1,0,01,16 అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం ప్రారంభించిన ఏడేళ్లలో ఇప్పటి వరకు టేకులపల్లి మండలంలో 2,064 మంది లబ్ధిదారులకు రూ.19.52 కోట్లు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రాధ, తహసీల్దార్ వీరభద్రం, ఎంపీడీఓ వీరబాబు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్, సర్పంచులు, మాలోత్ రాజేందర్ నాయక్, సురేందర్ నాయక్, బానోత్ విజయ, ఎంపీటీసీ, చింత శాంత కుమారి, రెవెన్యూ అధికారులు రత్తయ్య, వెంకటేశ్వర్లు, కాంతయ్య, రమేష్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ వార్డులో చెత్త సేకరించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

పాల్వంచ: ప్రతీ వార్డు నుంచి పొడిచెత్తను ఎక్కువగా సేకరించాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శానిటేషన్ జవాన్లు, వార్డు ఆఫీసర్లు, మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతీ వార్డులో ఆర్ఆర్ఆర్ సెంటర్లు పెట్టడం జరిగిందని, మే 20 నుంచి జూన్ 5 వరకు పట్టణంలోని ప్రతి ఇంటి నుంచి పొడి చెత్తని తీసుకొచ్చి సెంటర్లలో అప్పగించాలన్నారు. ఇలా ప్రతి వార్డులో ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఏ వార్డులో ఎక్కువ పొడి చెత్త వస్తుందో ఆ వార్డును బెస్ట్ వార్డుగా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. జూన్ 5న పర్యావరణ దినోత్సవం సందర్భంగా లార్జ్ స్కేల్ క్లీనింగ్ నెస్ డ్రైవ్‌ని ప్రతివార్డులు చేసి, మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతిజ్ఞ చేయించాలన్నారు.

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని ప్రతీ వార్డులోనూ ఆర్ఆర్ఆర్ సెంటర్లను ఏర్పాటు చేసి అవసరం లేని వస్తువులను రీయూజ్ చేసే విధంగా చేయాలని మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ఆర్ఆర్ఆర్ సెంటర్‌లని ప్రతీ వార్డులో ఏర్పాటు చేసి ఇళ్లల్లో ఉపయోగించని వస్తువులను ఈ సెంటర్ల ద్వారా సేకరించి రీసైకిల్ చేసి అవసరం ఉన్న వారికి ఇచ్చే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. ఇలా అధిక మొత్తంలో సేకరించిన కేంద్రాలకు జూన్ 5న వరల్డ్ ఎన్విరాన్‌మెంట్ డే సందర్భంగా అవార్డుకి ఎంపిక చేస్తామన్నారు. మున్సిపల్ మేనేజర్ సత్యనారాయణ, రిసోర్స్‌పర్సన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వీరభద్రచారి, అశోక్, జవాన్లు, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కొనసాగించండి



వార్డుల్లో సమస్యలు తెలుసుకుంటున్న చైర్మన్ డీవీ, కౌన్సిలర్లు

ఇల్లెందు: పట్టణంలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ కొనసాగించాలని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కమిషనర్ అంకుషావలీతో కలిసి కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బందితో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపల్ శాఖ నుంచి ఆదేశాలు విడుదల కావటంతో అంతా స్పెషల్ డ్రైవ్‌కు ఏర్పాట్లు చేయాలని సూచించారు. వార్డులలో నెలకొన్న సమస్యలను ఆరా తీశారు. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ఎలా నిర్వహించాలనే అంశం మీద అందరితో చర్చించారు. అనంతరం ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అక్రమ పంపు కనెక్షన్లను తొలగించాలని, రెగ్యులర్ చేసుకునే వారికి అవకాశం కల్పించాలని సూచించారు. బిల్లులు సక్రమంగా వసూలు చేయాలని ఆదేశించారు. ఎండాకాలంలో మంచినీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పట్టణంలో తిరిగి స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కమిషనర్ అంకుషావలీ, కౌన్సిలర్లు సయ్యద్ ఆజమ్, చీమల సుజాత, తార, రవీందర్, నవీన్‌కుమార్, డీఈ నరేష్‌రెడ్డి, ఏఈ ఉన్నారు.

ఎన్డీ పార్టీకి పలువురు రాజీనామా



పార్టీ కండువా కప్పి ప్రజాపంథాలోకి ఆహ్వానిస్తున్న రంగారెడ్డి

జూలూరుపాడు: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీకి మండల కార్యదర్శి వై.గోపాల్‌రావుతోపాటు పలువురు నాయకులు రాజీనామా చేసి సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీలో చేరారు. మంగళవారం జూలూరుపాడులో ప్రజాపంథా పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి కెచ్చల రంగారెడ్డి, కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి మాచర్ల సత్యం, జిల్లా కార్యవర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ, ఆర్ మధుసూదన్‌రెడ్డిల సమక్షంలో ఎన్డీ పార్టీ మండల కార్యదర్శి వై.గోపాల్‌రావు, ఎస్‌డీఎల్‌సీ సభ్యులు రాయల సిద్ధు, కూరాకుల నరసింహారావు, కె.పద్మ, మడి సీతారాములు, ఏఐకేఎంఎస్ నాయకులు బచ్చల నాగేశ్వరరావు, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు పోతిన్ని కమల, కె.పుష్ప, పుల్లమ్మ ప్రజాపంథా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి బానోత్ ధర్మా, లింగాల వీరభద్రం, ఇరప రాజు, గడ్డం పాపక్క, కుంజా సులోచన, బానోత్ సుజాత, జవహర్‌లాల్, తాటి నరసింహారావు, ఎం.కృష్ణయ్య, పి.బాబురావు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

వృథా అవుతున్న తాగునీరు..

లక్షల వ్యయం చేసి శుద్ధి చేసి ప్రజలకు అందజేస్తున్న తాగునీరు పైపులైన్ లీకేజీల కారణంగా వృథా అవుతున్నాయి. దీంతో కుళాయిల ద్వారా అరకొరగా మాత్రమే తాగునీటి సరఫరా జరుగుతోంది. లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీలోని పెట్రోల్ బంక్ ఎదట మున్సిపాలిటీ తాగునీటి పైపులైన్ లీక్ కావడంతో తాగునీరు విడుదల చేసినప్పుడల్లా సగం కంటే ఎక్కువ వృథా అవుతున్నాయి. ఎవరూ పట్టించుకోవడం లేదు. రోడ్డుపై వృథా అవుతున్న ఈ నీటితో ద్విచక్ర వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– పాల్వంచరూరల్



ప్రశ్నించాల్సిన అధికారి : సీహెచ్.శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్, పాల్వంచ
సెల్ నెంబర్: 9849905884